ISSN:3048-5908 Impact Factor: 3.63 (SJIF)

సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-1, Issue-2, (Oct-Dec), 2024

# తెలంగాణ రైతు కథలు ` జీవన చిత్రణ

డా॥.ఎస్.విద్యా ప్రవీణ
తెలుగు అసిస్టెంట్ ప్రొఫెసర్,ఎస్.ఆర్.ప్రభుత్వ ఆర్ట్స్ మరియు సైన్స్ కళాశాల,కొత్తగూడెం,
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,తెలంగాణ

Received: 15/11/2024 Article Accepted: 24/12/2024
Published Online: 27/12/2024 DOI:10.53414/Sahithyatharangini.2024.3.1.183

**వ్యాస సంగ్రహం:**

తెలంగాణ నుండి వెలువడ్డ రైతు కథలను పరిశీలించి చూస్తే భూముల రేట్లు పెరగడం వల్ల రైతు జీవన విధానంలో వచ్చిన మార్పులను చిత్రీకరించిన కథలు, రైతులు వలస పోవాల్సిన పరిస్థితులను చిత్రీకరించిన కథలు, కరువు కాటకాలను విశ్లేషించిన కథలు, రైతు కుటుంబంలోని ఆత్మహత్యలకు కారణాలను పరిశీలించిన కథలు, రైతు కుటుంబంలో మానవ సంబంధాలను చర్చించిన కథలు, రైతుకు పాడికి మధ్య ఉండే అనుబంధాన్ని చెప్పే కథలు, రైతు మానసికంగా ఎదుర్కొంటున్న సంఘర్షణను పరిశీలించిన కథలు, రైతు జీవనవిధానంలో అప్పులకు దారితీస్తున్న పరిస్థితులను వివరించడమే ఈ వ్యాసం ఉద్దేశం.

**కీలక పదాలు:** ముడిసరుకు, ఎవుసం, భూమి, కరువు, చెలక, పాడి, భూమిపుత్రుడు.

**ప్రవేశిక:**

సమాజం, సాహిత్యం రెండూ ఒకదానికొకటి పరస్పరం విడదీయలేనివి. సాహిత్యానికి మనిషి జీవితమే ప్రధానమైన ముడిసరుకు కాబట్టి మానవుని జీవన విధానాన్ని చిత్రిస్తూ సాహిత్యం వెలువడుతుంది. జీవన చిత్రణ అంటే "ఏ ఏ శక్తుల ప్రాబల్యం చేత జీవన స్థితిగతుల్లో మార్పు వస్తుందో ఆ వచ్చిన మార్పు ఆలోచనా ధోరణిలోనూ జీవన గమ్యాన్ని నిర్దేశించుకోవడంలోనూ ఎట్లా పర్యవసిస్తుందో తెలియజేయడమే" (చేదుఫలం - జీవన్.- పుట 17)

మనిషి జీవన విధానం అనేది ప్రాంతాన్ని, కులాన్ని, వృత్తిని, ఆర్థిక పరిస్థితిని బట్టి వారి సామాజిక జీవనం భిన్నంగా ఉంటుంది. ఒక్కో వర్గానికి, ఒక్కో వృత్తి వారికి, ప్రతీ వ్యక్తికి తమకంటూ ప్రత్యేకమైన జీవన విధానం ఉంటుంది. అలాగే వ్యవసాయ వృత్తిని ఎంచుకున్న రైతులకు కూడా ప్రత్యేకమైన జీవన విధానం ఉంటుంది. రైతులకు ఉండే ప్రత్యేకమైన జీవన విధానాన్ని, వారి జీవన విధానంలో వస్తున్న మార్పులను తెలంగాణ రచయితలు అత్యంత ప్రతిభావంతంగా కథలలో చిత్రీకరించారు.

రైతుకు భూమి అంటే ప్రాణం. అలాంటి భూమిని కాపాడుకోవడం కోసం ఎంతగానో ప్రయత్నిస్తాడు. ఇతరుల చేతిలో తన భూమి చిక్కుకొనిపోయినప్పుడు దాన్ని రక్షించుకోవడానికి కుటుంబ సంబంధాలను, చివరకు తన ప్రాణాలను వదులుకోవడానికి కూడా సిద్ధపడుతాడు. రైతు కుటుంబాలలో ఆప్యాయతలతో పాటు భూముల కోసం గొడవలు కూడా జరుగుతుంటాయి. ఈ గొడవలకు గల కారణాలను పరిశీలిస్తే ఎక్కువగా అప్పులు, భూముల కోసం అన్నదమ్ములకు మధ్య వివాదాలు అవుతున్నట్లు కనబడుతుంది. రైతు కుటుంబాలలో భూతగాదాలకు గల కారణాలను రచయితలు కథలలో చిత్రీకరించారు.

దిలావర్ రాసిన "నీ పెద్దోడొచ్చిండమ్మా" కథలో పూలమ్మ భర్త తాగుడుకు బానిసై కుటుంబాన్ని పట్టించుకోడు. పూలమ్మనే వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తూ ముగ్గురు పిల్లలను చదివిస్తుంది. కొద్ది రోజుల తర్వాత పూలమ్మ భర్త అనారోగ్యంతో చనిపోతాడు. పూలమ్మకు భర్త నుండి వచ్చిన భూమి మీద ఆమె మరిది కన్ను పడుతుంది. పూలమ్మ భర్త చనిపోయిన తర్వాత భూమి విషయంలో ఆమె మరిది పూలమ్మతో తరుచూ గొడవలకు దిగుతాడు. ఒంటరి మహిళ కావడంతో ఆమెను రకరకాలుగా ఇబ్బందులకు గురిచేస్తాడు. పొలాన్ని " పంచుకున్న తర్వాత కూడా పన్నులన్నింటిని ఆమె చేతనే కట్టిస్తాడు. పూలమ్మ పొలంలోని పంటంతా తనదేనని ఆమెను బెదిరిస్తాడు. గ్రామంలో ఒక ఏడాది వర్షాలు పడకపోవడంతో కరువు ఏర్పడుతుంది. పూలమ్మకు పిల్లలను పోషించడం కష్టమవుతుంది. ఒక రోజు పిల్లలు ఆకలి బాధను తట్టుకోలేక చిన్నానాయిన ఇంట్లో జరిగే పెండ్లి భోజనం తినడానికి పోతామని పెద్ద కొడుకు తల్లిని అడుగుతాడు. అది విన్న ఆమెకు, పెద్ద కొడుకుకు మధ్య సంభాషణ ఇలా సాగుతుంది. "వద్దు కొడుకా గది పగోని యిల్లు, పాలోని పగ పాము పగనుమంటిది. మీరు గాని కండ్లబడ్తా మిమ్మల్ని నాగ్గాకుండా జేత్తరు. నా పానం బోయినాగని, మీ మీన గా పాపిష్టోని నీడ పడనియ్య. ఎవడమ్మా వాడు? ఇంగెవడు? మనల్ని నాశనం జేద్దామనుకుంటున్న మీ శిన్నాయిన" (చంద్రుడు గియ్యని బొమ్మలు -దిలావర్. -పుట 156, 157) అని అంటుంది. పై కథలో భూమిని కాపాడుకొనే విషయంలో అన్నదమ్ముల మధ్య గొడవలు జరుగుతుండడాన్ని గమనించవచ్చు. భూమి కోసం ఇద్దరు అన్నదమ్ముల మధ్య గొడవలు ప్రారంభం కావడం క్రమంగా అది తరతరాలపాటు కొనసాగడాన్ని చూడవచ్చు. రెండు కుటుంబాల మధ్య ఆత్మీయమైన పలకరింపులు కరువై పగకు దారితీయడం కనిపిస్తుంది.

గోగు శ్యామల రాసిన "ఎల్లమ్మ దస్కింది" కథలో ఎల్లమ్మ మొదట కౌలురైతుగా కష్టపడి పనిచేసి స్వంతంగా ఇరవై ఎకరాల పొలాన్ని సంపాదించుకుంటుంది. ఆ భూమిలో పంట పండించుకుంటూ తన పన్నెండు మంది కొడుకులను, బిడ్డలను పోషిస్తుంది. ఆ భూమే ఆ కుటుంబానికి పూర్తి జీవనాధారం. ఎల్లమ్మ బిడ్డల పెండ్లిల్లు ఎంతో ఆడంబరంగా చేస్తుంది. ఎల్లమ్మ కొడుకులకు వ్యవసాయం చేయడం ఇష్టంలేక పట్నం బాటపడతారు. ఆ

ఊరిలోకి ఆంధ్రావాళ్లు వచ్చి తెలంగాణ వాళ్ల భూములను కొని పత్తి, మిర్చి లాంటి వ్యాపార పంటలు పండించుకుంటూ లక్షలు సంపాదిస్తారు. ఒక రోజు ఎల్లమ్మ దగ్గరికి వచ్చి ఆమె భూమిని అమ్ముమని ఆంధ్రా వాళ్లు ఒత్తిడి చేస్తారు. కానీ ఆమె మాత్రం భూమి అమ్మడానికి ససేమీరా ఒప్పుకోదు. ఎంతో కష్టపడి సంపాదించిన భూమిని సాగు చేసే వాళ్లు లేరని ఈ విధంగా బాధపడుతుంది. "తనకున్న సంతానం నాగలివట్టి దున్నే బదులు పట్నం బాట పట్టిండ్రు. ఇల్లును, భూమిని కాపాడుకొని బతుకుతారనుకున్న కొడుకులు, బిడ్డలు కండ్లముందు లేకుండ చిల్లం పల్లెం అయినందుకు దిగులుపడుతున్నది. దినదినాని భూమి పడావ్ వద్దదేమోనని కుదెం పట్టుకున్నది... అల్లారు ముద్దుగా పెంచుకున్న కొడుకులు బిడ్డలు... భూమికి ఊరికి దూరమైతరేమో, ఇంటికి తాలం పడుతదేమో.భూమి పడావ్ పడి అగ్గిసగ్గల అమ్ముడైపోయి ఎవుసం బందౌతదేమోనని దస్కింది.(తెలంగాణ వెతలే కథలై -అనిశెట్టి రజిత, అమృతలత (సంపా )-పుట -65)

ముదిగంటి సుజాతరెడ్డి రాసిన "దోపిడి" కథలో నర్సమ్మ, యాదయ్య సన్నకారు రైతులు. వారికి ఉన్న పొలంలో వరి పంట పండిస్తారు. నర్సమ్మ చిన్న పిల్లవాన్ని పట్టుకొని "ఒక్కతె పొలం నాటు వేసుకుంది. ఒక్కతె కలుపు తీసుకుంది. పొలానికి ఎరువులు వేసేటప్పుడు పురుగుమందు కొట్టేటప్పుడు నర్సమ్మ యాదయ్య వెంటవుండి సాయపడింది." ( తెలంగాణ రచయిత్రుల కథలు -అనిశెట్టి రజిత (సంపా )- 102). బాగా పండిన పంటను అమ్మగా వచ్చిన డబ్బుతో అప్పుకట్టి, మళ్ళీ అప్పు తీసుకొని బోరు వేయించాలనుకుంటుంది. నర్సమ్మ అనుకున్నట్టుగానే ఆ యేడు పంట బాగా పండుతుంది. ఆమె భర్త పేరు మీద పొలం ఉండడం వల్ల లోను తన పేరు మీద రాదని తెలుసుకుంటుంది. పంటంతా అమ్మగా వచ్చిన డబ్బును తీసుకొని పట్నం వెళ్లి పాత లోను బాకీ కట్టి మళ్లీ కొత్త లోను తీసుకురమ్మని భర్తను పట్టణానికి పంపిస్తుంది. పట్టణానికి వెళ్లిన ఆమె భర్త ఆ డబ్బుతో తాగుడుకు, గుర్రపు పందాలకు, స్త్రీల సౌఖ్యం కోసం ఖర్చు చేసి ఖాళీ చేతులతో ఇంటికి వస్తాడు. నర్సమ్మ చేసిన రెక్కల కష్టమంతా భర్త ఒక్కరోజులోనే పాడుచేసినందుకు దుఃఖపడుతుంది.

వ్యవసాయ పనులలో గ్రామీణ మహిళా శ్రామికుల పాత్ర అసాధారణమైంది. వ్యవసాయ పనులలో మహిళలు శారీరకంగా ఎంతో శ్రమిస్తున్నారు. పితృస్వామిక భావజాలం వల్ల భూమిపై యాజమాన్య హక్కులన్నీ మగవాళ్ళ చేతులలోనే ఉండడంతో మహిళలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. నర్సమ్మ తన భర్త కంటే కూడా ఎక్కువ పని ఆమెనే చేస్తున్నట్టూ గమనించవచ్చు. పొలం పనులలో భర్తకు చేదోడు వాదోడుగా ఉంటూ కుటుంబ అభివృద్ధికి అనుక్షణం తపిస్తుంది. స్త్రీ ఎంత కష్టపడ్డా ఆమెకు తగిన గౌరవం దక్కడం లేదు. స్త్రీ ఎంతో శ్రమించినప్పటికీ కుటుంబంలో ఆర్థిక పరమైన నిర్ణయాలలో ఆమెకు స్వేచ్ఛ ఉండకపోవడాన్ని ఈ కథలో చూడవచ్చు.

ISSN:3048-5908 Impact Factor: 3.63 (SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-1, Issue-2, (Oct-Dec), 2024

ఆధునిక కాలంలో యువత ఎవరూ వ్యవసాయం చేయడానికి ఇష్టపడడం లేదు. ఉన్న ఊరిని కన్న తల్లిని వదిలి పట్టణాల వెంట వెళుతున్నారు. కానీ భూమినే నమ్ముకొని, భూమి మీద ఆధారపడి జీవిస్తున్న భూమిపుత్రులు మాత్రం తమ భూమిని ముందు తరానికివ్వి వాటిని కాపాడుకోవాలనుకుంటారు. ఎల్లమ్మ కొడుకులు వ్యవసాయం చేయకుండా పట్టణాల వెంట వెళ్లడంతో తన భూమి ఏం అయిపోతుందో అన్న బాధతో, భూమి మీద ఉన్న ప్రేమతో ఒక విధమైన మానసిక క్షోభను అనుభవిస్తుంది.

పనులలో రైతుకు పశువులు ఎంతగానో తోడ్పడతాయి. ఇంట్లో పెంచుకునే పెంపుడు జంతువులకు ముద్దు పేర్లు పెట్టుకున్నట్లుగానే, రైతులు పాడి పశువులకు కూడా ముద్దుపేర్లు పెట్టుకొని ఎంతో ప్రేమగా చూసుకుంటారు. కొందరు రైతులు పాడివల్లనే వారికి అదృష్టం కలిసి వచ్చిందని భావిస్తారు. మేరెడ్డి యాదగిరిరెడ్డి రాసిన 'రైతు యాత్రు' కథలో రైతుకు పాడికి మధ్య ఉండే అనుబంధాన్ని రచయిత ఇలా చెపుతాడు. "ఓ ఆవు, రెండెడ్లు, ఓ బర్రె, బండి ఇవి తండ్రికాలం నుండి వున్నవే, ట్రాక్టర్లు ఆటోలు వచ్చేదాక వూరిలో ఎవరికి ఏ అవసరం పడ్డా వీరి బండి కిరాయికి వెళ్లాల్సిందే. ఆవుకు లక్ష్మి అని, దానికి పుట్టిన కోడెదూడలకు, రాముడు, లక్ష్మణుడు అని పేర్లు పెట్టుకున్నాడు చంద్రయ్య. ఆ ఆవంటే చంద్రయ్యకు పంచప్రాణాలు. అది వచ్చిన నాటి నుండి తనకు కలిసి వచ్చిందని వున్న రెండెకరాల భూమి ఆరెకరాలయిందని పండుగ పండుగకు శుభ్రంగా కడిగి పసుపు కుంకుమ చల్లి మెడకు పూలదండ వేసి దండం పెట్టుకుని పనికిపోయేవాడు." (బొడ్రాయి` యాదగిరిరెడ్డి, పుట 93). పై సంభాషణలో చంద్రయ్యకు పశువుల మీద ఉన్న అభిమానాన్ని రచయిత పై విధంగా వ్యక్తీకరించాడు. రైతుకు తరతరాల నుండి వారసత్వంగా వచ్చే ఆస్తిలో పశువులు కూడా ఒకటి. రైతులు వాటిని ఎంతో ప్రేమగా, జాగ్రత్తగా చూసుకుంటారు. అతను ఆర్థికంగా ఎదగడానికి కారణం ఆవులే అని నమ్మి, వాటిని పూజిస్తాడు. భారతీయ ధర్మంలో ప్రకృతి ఆరాధన, గోమాతను పూజించడం అనే ఆచారం ఎన్నో సంవత్సరాల నుండి ఉన్నది. ఈ సనాతన ఆచారాన్ని ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాలలో నివసించే ప్రజలు, రైతులు ఎక్కువగా పాటిస్తున్నారు.

అంపశయ్య నవీన్ రాసిన "ఆత్మహత్యలా? హత్యలా?" కథలో గౌరమ్మ, సత్తెయ్య ఇద్దరూ కలిసి ఎంతో కష్టపడి పత్తి సాగు చేస్తారు. కానీ పత్తి పంటకు గిట్టుబాటు ధర లేక నష్టపోతారు. రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర లేకపోవడాన్ని గురించి గౌరమ్మ అనే ఆడ రైతు ఇలా చెపుతుంది. "ఎన్నో అప్పులు చేసి, ఎన్నో కష్టాలు పడి అన్ని జాగ్రత్తలు తీసుకున్నాక నాల్గెకరాల్లో వేసిన పత్తిపంట చేతికొచ్చింది. ఈ సారి కూడా దిగుబడి బాగనే వచ్చింది. ఎకరానికి 16 క్వింటాళ్ళు పండింది. ధర మాత్రం అనుకున్నంత గిట్టుబాటు కాలేదు" (అస్మదీయులు తస్మదీయులు -అంపశయ్య నవీన్.- పుట : 9) అని బాధపడుతుంది. పై కథలో భార్యభర్తలు ఇద్దరూ రెక్కలు ముక్కలు చేసుకొని కష్టపడి అప్పు చేసి మరీ పంట పండించినప్పటికీ గిట్టుబాటు ధర లేక

ISSN:3048-5908 Impact Factor: 3.63 (SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-1, Issue-2, (Oct-Dec), 2024

నష్టపోతుండడాన్ని గమనించవచ్చు. ఇలా రైతు పండించిన పంటకు తగినంత ధర లేకపోవడం వల్ల నష్టాల్లోకి కూరుకుపోవాల్సి వస్తుంది. రైతు అప్పులు చేసి మరీ పండించిన పంటకు పెట్టిన పెట్టుబడికి కూడా తగినంత ధర రాకపోవడంతో మరిన్ని అప్పులు చేయాల్సి వస్తుంది.

సాధారణంగా ఒక వస్తువును తయారుచేసిన తర్వాత దానికి ధర నిర్ణయించే అధికారం తయారు చేసిన వ్యక్తి లేదా సంస్థ చేతిలో ఉంటుంది. వాళ్లు ఎంత ధర నిర్ణయిస్తే అంతే ధర పెట్టి వినియోగదారుడు వస్తువును కొనుగోలు చేయాల్సి ఉంటుంది. అలాగే వ్యవసాయరంగం విషయానికి వచ్చేసరికి కూడా రైతు పంట కోసం కొన్న విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు, ఆ పంట కోసం అతను పడ్డ శ్రమ ఇవన్నీ కలిపి రైతే ధర నిర్ణయించుకోవాలి. కానీ ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు ధర నిర్ణయించే అధికారం రైతు చేతిలో లేకుండా పోయింది. రైతు పండించిన పంటకు బహుళజాతి సంస్థలు, దళారులు, వ్యాపారులు ధరను నిర్ణయిస్తున్నారు.

రైతుకు పాడి ఆర్థికంగా ఎలా చేయూతనిస్తుందో మేరెడ్డి యాదగిరిరెడ్డి రాసిన "బి.టి. విత్తనం" కథలో చూడవచ్చు. ఈ కథలో గోవిందుకు ఐదు ఎకరాల భూమి ఉంటుంది. దాంతో పాటు నలభై గొర్రెలు ఉంటాయి. "గోవిందు, సుశీల వ్యవసాయం పనులు చేస్తే మల్లయ్య తమకున్న నలభై గొర్లను మేపుకొస్తుంటాడు. గొర్రెల పెంపకం వాళ్లకు తరతరాల జీవనోపాధి. కాలంలోను కరువులోను అవే వాళ్లను కాపాడుతున్నాయి. ఈ అయిదెకరాల చెలక, చెరువు కింద ఎకరం పొలం గొర్ల మీద సంపాదించుకున్నదే" (కొలిమి ` యాదగిరిరెడ్డి ` పుట` 66) అని రచయిత గోవిందు కుటుంబానికి ఆధారమైన పాడి పెంపకాన్ని గురించి చెప్తాడు. పై కథలోని అంశాలను గమనిస్తే గోవిందు కుటుంబంలో పాడి తరతరాలుగా జీవనోపాధిగా ఉండటాన్ని గమనించవచ్చు. గొర్ల పెంపకం గోవిందు కుటుంబానికి కరువు సమయంలో ఆర్థిక చేయూతను అందించిందనే విషయాన్ని అర్థం చేసుకోవచ్చు.

"మేరెడ్డి యాదగిరిరెడ్డి రాసిన "భూమి పుత్రుడు" కథలో భూలక్ష్మయ్య భూమినే నమ్ముకొని బతుకే రైతు. అతనికున్న ఐదెకరాల భూమిని ఎంతో కష్టపడి సాగుచేసుకుంటూ బతుకుతాడు. "భూలక్ష్మయ్యకు భూమంటే ఆరో ప్రాణం. మట్టి వాసన పిల్చందే బ్రతుకలేని మనిషి, పంటలంటే పంచప్రాణాలు. పొలం విడిచి ఒక్కరోజయినా ఎక్కడాగింది లేదు. ఎటుపోయినా పొద్దుగూకే వరకు పొలం దగ్గరకు చేరవలసిందే." (బొడ్రాయి` యాదగిరిరెడ్డి` పుట` 75).

భూమయ్య భూమిని అమితంగా ప్రేమిస్తాడు. భూమయ్య కొడుకు రాంబాబు తండ్రి ఆలోచనలకు పూర్తి భిన్నంగా ఉంటాడు. రాంబాబు లేని గొప్పలకు పోయి అన్ని సౌకర్యాలను అనుభవించాలనే కోరికతో అప్పు చేసి మరీ టి.వి, ఫ్రిజ్, డబల్కాట్ మంచం మొదలైన వస్తువులను కొనుగోలు చేస్తాడు. బైక్ కొనడం కోసం బండెడ్లను బేరం పెడతాడు. భూమి పాస్బుక్ కుదవపెట్టి ట్రాక్టర్ కొంటాడు. ఊరిలో సర్పంచ్ పదవికి పోటీ చేసి ఓడిపోయి మరింత అప్పులలోకి కూరుకుపోతాడు. రాంబాబుకు అప్పు ఇచ్చిన ఆనందరావు, మిగతా అప్పులవాళ్లు రోజూ ఇంటికి వచ్చి

ISSN:3048-5908 Impact Factor: 3.63 (SJIF)

సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-1, Issue-2, (Oct-Dec), 2024

గొడవ చేసి భూమిని అమ్మి అప్పులు కట్టమని ఒత్తిడి చేస్తారు. భూమయ్య కొడుకు చేసిన అప్పుల నుండి భూమిని రక్షించుకోవడానికి ఎంతగానో ప్రయత్నిస్తాడు.

"ఎలాగయినా తన భూమి తనకేవుండాలి. తాను రైతుగానే బతకాలి. బంగారం లాంటి భూమి తన ప్రాణం లాంటి భూమి పరుల పాలు కావద్దు. ఇవే ఆలోచనలు. పెరిగిన గడ్డం, చిందరవందర జుట్టు, మాసిన బట్టలు. ఏలాగయినా అప్పోసప్పో చేసి తన భూమిని ఆ ఆనందరావు చెర నుండి విడిపించుకోవాలి. పొద్దస్తమానం ఇదే ద్యాస" (బొడ్రాయి` యాదగిరిరెడ్డి` పుట` 83). భూలక్ష్మయ్య చివరకు భూమిని దక్కించుకోవడం కోసం ఒక కిడ్నీని అమ్మి అప్పులు కడుతాడు. పై కథలో రైతు భూమిని కాపాడుకోవడం కోసం చివరకు తన ప్రాణాలను కూడా లెక్క చేయకపోవడాన్ని చూడవచ్చు. భూమే తనకు ప్రాణం అన్నంతగా బతుకుతాడు. రైతుకు భూమి అంటే విపరీతమైన అభిమానం ఉంటుందని చెప్పడానికి భూమిపుత్రుడు కథలోని భూలక్ష్మయ్య పాత్ర నిదర్శనం. రైతు ప్రాణాలకంటే కూడా భూమికే ఎక్కువ ప్రాముఖ్యాన్ని ఇస్తాడనడానికి ఈ కథే ఒక ఉదాహరణ. అలాగే రామాచంద్రమౌళి రాసిన భూమి దుఃఖం కథలో కూడా రైతు భూమిని కాపాడుకోవడం కోసం పడే ఆరాటాన్ని గమనించవచ్చు.

ముగింపు:

ఈ వ్యాసం ద్వారా రైతుకూ భూమికీ మధ్య ఉన్న అవినాభావ సంబంధం తెలుస్తుంది. రైతు కుటుంబాలలో గల మానవ సంబంధాలు, భూమి కోసం జరుగుతున్న తగాదాలు రైతు కథలలో కనిపిస్తాయి. పల్లె ప్రాంతాలలో వచ్చిన మార్పులను, రైతుకు పశువులతో ఉండే అనుబంధాన్ని, వ్యవసాయ పనులలో స్త్రీలు పోషిస్తున్న పాత్రను, వ్యవసాయరంగం మీద ప్రపంచీకరణ చూపిస్తున్న ప్రభావాన్ని, ఈ ప్రభావంతో రైతు జీవితాలలో వస్తున్న గణనీయమైన మార్పులను, ప్రాజెక్టు నిర్మాణాల కోసం రైతులు భూములు కోల్పోయి నిర్వాసితులవుతున్న తీరూ కనిపిస్తాయి. భూమిని కోల్పోయి, ఉన్న ఊరిలో ఉపాధి కరువై వలస వెళుతున్న వాళ్ల సమస్యలు కనిపిస్తాయి. రైతులను దళారులు, షావుకార్లు దోపిడికి గురి చేస్తున్న తీరు కనిపిస్తుంది.

**ఆధార గ్రంథాలు**

బొడ్రాయి, యాదగిరి రెడ్డి. *కొలిమి.*

జీవన్. *చేదు ఫలం.*

దిలావర్. *చంద్రుడు గీయని బొమ్మలు.*

నవీన్, అంపశయ్య. *అస్మదీయులు, తస్మదీయులు.*

రజిత, అనిశెట్టి, మరియు అమృతలత, సంపాదకులు. *తెలంగాణ వెతలే కథలై.*

రెడ్డి, యాదగిరి. *బొడ్రాయి.*